సాక్షి మంచిర్యాల

బుధవారం । 29 । మే । 2024



డ్రైవింగ్ స్కూళ్లలోనూ లైసెన్స్

రహదారి భద్రత చట్టం అమలులో భాగంగా కేంద్ర ప్రభుత్వం మరో నూతన సంస్కరణకు శ్రీకారం చుడుతోంది. అక్రిడేటెడ్ డ్రైవింగ్ స్కూళ్లను అందుబాటులోకి తెస్తోంది. 8లో▸



అరచేతిలో వాతావరణం

విభిన్న వాతావరణ పరిస్థితులతో రైతులు అయోమయానికి గురవుతున్నారు. మార్పులు ప్రజలకు తెలిసేలా కేంద్ర ప్రభుత్వం ప్రత్యేక యాప్‌లు రూపొందించింది. 8లో▸

గరిష్టం/కనిష్టం
42.0 /32.0

వాతావరణం

ఆకాశం పాక్షికంగా మేఘావృతమై ఉంటుంది. పడమర దిశగా వేడిగాలులు వీస్తాయి. గరిష్ట ఉష్ణోగ్రతలు స్వల్పంగా పెరుగుతాయి. ఉక్కపోతగా ఉంటుంది.

న్యూస్‌రీల్

ఎరువుల దుకాణాల్లో తనిఖీ



నెన్నెలలో తనిఖీ చేస్తున్న సురేఖ

నెన్నెల: మండలంలోని ఎరువులు, విత్తనాలు, పురుగు మందుల దుకాణాలను జిల్లా వ్యవసాయాధికారి సురేఖ మంగళవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. నిల్వలు, రిజిష్టర్లు పరిశీలించారు. నిషేధిత, అనుమతి లేని విత్తనాలు, ఎరువులు అమ్మవద్దని, నిబంధనలు ఉల్లంఘించినా, కాలం చెల్లిన పురుగుల మందులు, ఎరువులు విక్రయించినా లైసెన్స్ రద్దు చేసి చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. దుకాణాల్లో ఉన్న విత్తనాలు, ఎరువుల నిల్వలపై అడిగి తెలుసుకున్నారు. రైతులు విత్తనాల కొనుగోలు రశీదులను పంట కాలం పూర్తయ్యే వరకు భద్రపర్చుకోవాలని తెలిపారు. ఏఓ ప్రేమ్‌కుమార్, ఏఈఓ రాంచందర్ పాల్గొన్నారు.

'రైతులపై లాఠీచార్జి జరగలేదు'

మంచిర్యాలటౌన్: ఆదిలాబాద్ జిల్లా కేంద్రంలో పత్తి విత్తనాల కోసం రైతులు భారీగా తరలి రావడం వాస్తవమేనని, కానీ వారిపై ఎలాంటి లాఠీచార్జి జరగలేదని మంచిర్యాల ఎమ్మెల్యే కొక్కిరాల ప్రేమ్‌సాగర్‌రావు ఒక ప్రకటనలో పేర్కొన్నారు. రైతులు అధైర్య పడవద్దని, ప్రతీ రైతుకు కావాల్సిన విత్తనాలు అందిస్తామని, రైతుల పక్షాన నిలిచే పార్టీ కాంగ్రెస్ ఒక్కటేనని, ప్రతీ రైతుకు పత్తి గింజలను అందిస్తామని తెలిపారు. రైతులపై లాఠీచార్జి అంటూ బీఆర్ఎస్, బీజేపీ నేతలు దుష్ప్రచారం చేస్తున్నారని, అన్నదాతకు అండగా ఉంటామని, విత్తనాల కోసం రైతులు ఆందోళన చెందాల్సిన పనిలేదని, అందుబాటులో ఉన్నాయని తెలిపారు.

రైతులకు ఇబ్బందులు లేకుండా చూడాలి



ఆస్నాదలో కొనుగోలు కేంద్రం వద్ద మాట్లాడుతున్న కలెక్టర్ సంతోష్

చెన్నూర్‌రూరల్: వరిధాన్యం కొనుగోలు కేంద్రాల్లో రైతులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా చూడాలని జిల్లా కలెక్టర్ బదావత్ సంతోష్ అన్నారు. మండలంలోని ఆస్నాద, ఒతుకులపల్లి, సోమనపల్లి గ్రామాల్లో వరిధాన్యం కొనుగోలు కేంద్రాలను మంగళవారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో 286 కొనుగోలు కేంద్రాల్లో నిబంధనల ప్రకారం రైతుల నుంచి నాణ్యమైన ధాన్యం కొనుగోలు చేస్తున్నామని తెలిపారు. ధాన్యం కొనుగోలు ప్రక్రియ త్వరగా పూర్తి చేయాలని అన్నారు. రైతుల వివరాలను ట్యాబ్‌లో నమోదు చేయాలని, ధాన్యాన్ని రైస్‌మిల్లులకు తరలించాలని నిర్వాహకులకు సూచించారు. తహసీల్దార్ మల్లికార్జున్, ఆర్ఐ రంజిత్‌కుమార్ పాల్గొన్నారు.

వరదలపై ముందస్తు చర్యలు తీసుకోండి



ఎన్టీఆర్‌నగర్‌లో వరద ప్రభావిత ప్రాంతాన్ని పరిశీలిస్తున్న అదనపు కలెక్టర్ రాహుల్

మంచిర్యాలటౌన్: వర్షాకాలం వస్తున్న సందర్భంగా గతంలో వరదలను దృష్టిలో ఉంచుకుని, ఈసారి వరదలు రాకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలని జిల్లా అదనపు కలెక్టర్ రాహుల్ అన్నారు. జిల్లా కేంద్రంలోని ఎన్టీఆర్ నగర్, హమాలీవాడల్లోని వరద ప్రభావిత ప్రాంతాలను మున్సిపల్ కమిషనర్ మారుతిప్రసాద్, డివిజనల్ ఇంజినీరు మధుకర్, ఏఈ రాజేందర్‌లతో కలిసి మంగళవారం పరిశీలించారు. మురుగు కాలువల్లో చెత్తాచెదారం పేరుకుపోకుండా చూడాలని, తద్వారా వరద నీరు నివాస ప్రాంతాల్లోకి రాకుండా కాలువల ద్వారా వెళ్లే అవకాశం ఉంటుందని తెలిపారు. మున్సిపల్ పరిధిలోని అన్ని వార్డులను శుభ్రంగా ఉంచేలా పారిశుధ్య చర్యలు చేపట్టాలని, రోడ్లపై చెత్త వేయకుండా ప్రజలకు అవగాహన కల్పించి, ఉల్లంఘించిన వారికి జరిమానా విధించాలని తెలిపారు. అనంతరం మంచిర్యాల మెప్మా ఆధ్వర్యంలో ప్రభుత్వ పాఠశాలల విద్యార్థుల కోసం యూనిఫాం కుట్టు కేంద్రాన్ని పరిశీలించారు. తరగతులు ప్రారంభం అయ్యేలోగా విద్యార్థులకు దుస్తులు అందించాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో మెప్మా అధికారులు రాజు, అరుణ, సుజాత పాల్గొన్నారు.

ఫుడ్.. తనిఖీలేవి?



గత నెలలో జిల్లా కేంద్రంలోని ఓ హోటల్‌లో అల్పాహారం తీసుకెళ్లిన పార్సిల్‌లో చిన్న ఎలుక కనిపించింది. దీనిపై వినియోగదారుడు నేరుగా ఆ హోటల్‌కు వచ్చి ఫిర్యాదు చేశాడు. దీనికి సంబంధించిన వీడియో వైరల్ కాగా.. ఆ హోటల్ నిర్వాహకుడు స్పందిస్తూ అది పాత వీడియోనని, తమకు సంబంధం లేదని వివరణ ఇచ్చుకున్నారు. ఇలాంటి ఫిర్యాదులు వస్తున్నా కఠిన చర్యలు తీసుకోవడం లేదనే విమర్శలున్నాయి.

జిల్లా కేంద్రం మంచిర్యాలలోని ఓ ప్రముఖ స్వీట్‌హౌజ్‌లో నాణ్యత సరిగా లేదని అప్పట్లో అధికారుల తనిఖీల్లో వెల్లడైంది. ఇప్పటికీ ఆ స్వీట్‌హౌజ్ స్వీట్ల నాణ్యతపై అనుమానాలే వ్యక్తమవుతుంటాయి. సరైన నాణ్యత పాటించని స్వీట్‌హౌజ్‌లు అనేకంగా ఉన్నాయి.

- నాణ్యతను విస్మరిస్తున్న తయారీదారులు
- హోటళ్లు, రెస్టారెంట్లు, దుకాణాలపై నిఘా కరువు

సాక్షి ప్రతినిధి, మంచిర్యాల: జిల్లాలోని హోటళ్లు, రెస్టారెంట్లు, టిఫిన్‌సెంటర్లు, బేకరీలు, స్వీట్‌హౌజ్‌ల్లో, ఇతర తినుబండారాల నాణ్యతను పరిశీలించే నాథుడే కరువయ్యారు. శుచి, శుభ్రత లోపిస్తున్నా నిర్వాహకులు ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నారు. జిల్లా కేంద్రంతోపాటు పట్టణాల్లో పుట్టగొడుగుల్లా తినుబండారాల దుకాణాలు వెలుస్తున్నాయి. ఆహారాన్ని తనిఖీ చేయకపోవడంతో ఇష్టారీతిన వ్యవహరిస్తున్నారు. హోటళ్లు, రెస్టారెంట్లు, టిఫిన్ సెంటర్లు పుట్టగొడుగుల్లా వెలుస్తుండగా.. వ్యాపార ధోరణితో నాణ్యతను గాలికి వదిలేస్తున్నారు. చాలా చోట్ల అపరిశుభ్రంగా కనిపిస్తోంది. తాగేనీరు, ప్లేట్లు, గ్లాసులు, తినే ఆహారంలోనూ సరైన నాణ్యత ఉండకపోవడంతో రుచి కోసం అధిక గాఢత కూడిన మసాలాలు, రసాయనాలు వేస్తూ వినియోగదారులను ఆకర్షిస్తున్నారు.

ఇక తాగునీరు సైతం పలు రకాల బ్రాండ్లతో అమ్మకాలు సాగిస్తున్నారు. కూరగాయలు, పండ్లు, మాంసం వంటి వాటిపై శుచి, శుభ్రత కరువవుతోంది. చిన్న హోటళ్ల నుంచి స్టార్ హోటళ్ల దాకా ప్రతీచోట తనిఖీలు చేయాల్సి ఉన్నా పట్టింపు కరువైంది. పలు జిల్లాల్లో అధికారులు తనిఖీ చేస్తున్నప్పటికీ జిల్లాలో కానరావడం లేదు.

పర్యవేక్షణ కరువు

పట్టణాల్లో మున్సిపల్ అధికారులతోపాటు ఫుడ్ ఇన్‌స్పెక్టర్ పర్యవేక్షణ లేకపోవడం వినియోగదారులకు శాపంగా మారింది. ఎప్పటికప్పుడు పర్యవేక్షణ చేయాల్సి ఉన్నా స్థానిక మున్సిపాలిటీ అధికారులు, ఇటు ఫుడ్ ఇన్‌స్పెక్టర్ నుంచి తనిఖీలు లేకపోవడంతో నాణ్యతకు తిలోదకాలు ఇస్తున్నారు. రోజుల తరబడి నిల్వ ఉంచడంతోపాటు సరిగా లేనివి అమ్మకాలు సాగిస్తున్నారు. వీటితోపాటు శాకాహార పదార్థాలతోపాటు మంసాహారంలోనూ నాణ్యత ఉండడం లేదు. వినియోగదారులు ఫిర్యాదులు చేయకపోవడంతో అధికారులు సైతం స్పందించడం లేదు. పండుగలు, ప్రత్యేక సందర్భాల్లో వినియోగం అధికంగా ఉన్న రోజుల్లో ఆహార నాణ్యతపై మరింత సందేహాలు ఉన్నాయి. జిల్లాలో ఆహార శాలల్లోని తనిఖీలు, నాణ్యతపై ఫుడ్ ఇన్‌స్పెక్టర్ భద్రను ఫోన్‌లో సంప్రదించగా ఆయన స్పందించలేదు.

నేటి నుంచి పుస్తకాల పంపిణీ

- బుక్‌డిపోల నుంచి ఎమ్మార్సీలకు..
- జిల్లాకు చేరిన 82శాతం పాఠ్యపుస్తకాలు
- వందశాతం చేరిన నోట్‌పుస్తకాలు
- పలు పాఠశాలలకు యూనిఫామ్‌లు అందజేత



ప్రభుత్వ బుక్ డిపోలో పుస్తకాలు

మంచిర్యాలఅర్బన్: ప్రభుత్వ పాఠశాల పునఃప్రారంభం రోజున విద్యార్థుల చేతికి పుస్తకాలు అందించేందుకు విద్యాశాఖ కసరత్తు చేస్తోంది. అందుకు అవసరమైన పుస్తకాల సరఫరాకు చర్యలు చేపట్టింది. జిల్లా బుక్‌డిపో నుంచి ఎమ్మార్సీలకు సరఫరా చేసి అక్కడి నుంచి వెనువెంటనే పాఠశాలలకు పంపిణీకి శ్రీకారం చుట్టింది. విద్యార్థులకు ఉచితంగా పాఠ్యపుస్తకాలు, రాతపుస్తకాలు(నోట్‌బుక్స్) పంపిణీ చేయనున్నారు. 2024–25 విద్యాసంవత్సరం ప్రారంభానికి ముందే పాఠశాలలకు చేరేలా సన్నద్ధం చేస్తున్నారు. బుధవారం నుంచి ప్రభుత్వ బుక్ డిపో నుంచి ఎమ్మార్సీలకు పాఠ్యపుస్తకాల పంపిణీ ప్రక్రియ చేపట్టనున్నారు.

వందశాతం నోట్‌పుస్తకాలు

పాఠశాలల ప్రారంభానికి ముందే ప్రతీ విద్యార్థికి పాఠ్య, రాతపుస్తకాలు అందించాలని సంకల్పించింది. ప్రతియేటా పాఠ్య పుస్తకాలు వచ్చినా నోట్ పుస్తకాలు అందని పరిస్థితి. కేజీబీవీల్లో నోట్‌పుస్తకాలు సకాలంలో అందకపోవడంతో ఇబ్బందులు ఏర్పడ్డాయి. తరగతి గదిలో ఉపాధ్యాయులు చెప్పే పాఠాలపై ఆధారపడాల్సి వచ్చింది. స్నేహితులు ఇస్తేనో.. ఒకటి రెండు నోట్‌పుస్తకాలు కొనుగోలు చేయక తప్పలేదు. ఈ ఏడాది విద్యాసంవత్సరం ప్రారంభానికి ముందే వందశాతం నోట్‌పుస్తకాలు చేరాయి. యూపీఎస్, హైస్కూల్‌తోపాటు కేజీబీవీలకు నోట్‌పుస్తకాలు పంపిణీ చేయనున్నారు. 227 పాఠశాలలకు 2,49,446 నోట్‌పుస్తకాలు అవసరం కాగా ఇప్పటికే బుక్‌డిపోకు చేరాయి. ఆరు, ఏడు తరగతులకు 6, ఎనిమిదో తరగతికి 7, తొమ్మిది, పదో తరగతికి 14, ఇంటర్ విద్యార్థులు(కేజీబీవీ)లకు 12 చొప్పున ఒక్కో విద్యార్థికి నోట్ పుస్తకాలు అందజేస్తారు. పాఠ్యపుస్తకాలతోపాటు నోట్‌పుస్తకాలు ఎమ్మార్సీలకు సరఫరా కానున్నాయి.

జిల్లాకు అవసరమైనవి..

జిల్లాలోని ప్రభుత్వ పాఠశాలల్లో చదివే విద్యార్థులకు 3,04,310 పాఠ్యపుస్తకాలు అందజేయాల్సి ఉంది. ఇందులో 2,248,220 పుస్తకాలు బుక్‌డిపోకు చేరాయి. ఇప్పటివరకు 89శాతం పాఠ్య పుస్తకాలు చేరగా.. బుధవారం నుంచి ఆయా మండల వనరుల కేంద్రాలకు సరఫరా చేయనున్నారు. అక్కడి నుంచి పాఠశాలలకు చేరవేసి పాఠశాల పునః ప్రారంభం రోజున అందజేస్తారు.

చకచకా యూనిఫాంలు..

విద్యాసంవత్సరం సమీపిస్తుండడంతో పాఠశాలలు ప్రారంభమయ్యే నాటికి రెండు జతల యూనిఫామ్‌లు సిద్ధం కావాల్సి ఉంది. జూన్ 10లోపే కచ్చితంగా కుట్టిన యూనిఫాంలను ఉపాధ్యాయులకు మహిళా సంఘాల సభ్యులు అప్పగించేలా చర్యలు చేపట్టారు. జిల్లా పాలనాధికారి, డీఈవో ప్రత్యేక చొరవ చూపిస్తున్నారు. ప్రైవేట్‌కు దీటుగా యూనిఫాం డిజైన్‌ను గతేడాది నుంచి అమలు చేస్తున్నారు. మే 27 వరకు రూరల్ ఏరియాకు అవసరమైన 30,995 దుస్తులకు గాను 16,213 దుస్తులు పూర్తి చేశారు. 52శాతం పూర్తి చేయగా మిగతా వాటిని పూర్తి చేయాలని అధికారులు ఆదేశించారు. అర్బన్ ఏరియాలో 12,719 యూనిఫామ్స్‌కు గాను 4820(38శాతం) పూర్తి చేశారు. రూరల్ ఏరియా కంటే అర్బన్ ఏరియాలో దుస్తులు కుట్టడంలో వెనుకబడిపోయారు. మంగళవారం జన్నారం, హాజీపూర్ మండలాల్లో యూనిఫామ్స్ ఐదేసి పాఠశాల ప్రధానోపాధ్యాయులకు పంపిణీ చేశారు. జూన్ 5లోపు పూర్తిస్థాయిలో పాఠ్యపుస్తకాలు, నోట్‌పుస్తకాలు, యూనిఫామ్ అందేలా చర్యలు చేపట్టారు.

నకిలీ విత్తనాల విక్రయాలు అరికట్టాలి

- జిల్లా కలెక్టర్ బి.సంతోష్



మాట్లాడుతున్న జిల్లా కలెక్టర్ బి.సంతోష్

మంచిర్యాలఅగ్రికల్చర్: జిల్లాలో నకిలీ విత్తనాల విక్రయాలతోపాటు ఎరువుల కృత్రిమ కొరతను అధికారులు సమన్వయంతో అరికట్టాలని జిల్లా కలెక్టర్ బి.సంతోష్ అన్నారు. మంగళవారం నస్పూర్‌లోని కలెక్టరేట్‌లో నకిలీ విత్తనాల విక్రయం, ఎరువుల కృత్రిమ కొరత, ఇతర రాష్ట్రాల నుంచి ధాన్యం తరలింపు అంశాలపై జిల్లా వ్యవసాయ అధికారి సురేఖతో కలిసి మండల వ్యవసాయ అధికారులు, ఏడీఏలతో సమీక్ష సమావేశం నిర్వహించారు. కలెక్టర్ మాట్లాడుతూ ఇతర రాష్ట్రాల నుంచి జిల్లాలోకి ధాన్యం తరలించకుండా చర్యలు తీసుకోవాలని, అంతర్రాష్ట్ర చెక్‌పోస్టులు, నదీ మార్గాన తరలింపు జరగకుండా తనిఖీలు చేపట్టాలని సూచించారు. సాగుకు అవసరమైన పత్తి విత్తనాలు అందుబాటులో ఉన్నాయని, జిల్లాలో 292 దుకాణాల ద్వారా విక్రయిస్తున్నారని, నిల్వలు, విక్రయ వివరాలు, కొనుగోలు చేసిన రైతుల వివరాలతో నివేదిక రూపొందించాలని, ప్రతీ దుకాణంలో నిల్వలు, ధరలతో కూడిన పట్టిక ప్రదర్శించాలని అన్నారు. నకిలీ విత్తనాల విక్రయాల నియంత్రణకు విక్రయదారులపై క్రిమినల్ కేసులు నమోదు చేయాలని ఆదేశించారు. రైతులు సాగు చేస్తున్న విస్తీర్ణానికి అనుగుణంగా విత్తనాలు, ఎరువులు పంపిణీ జరిగేలా చూడాలని తెలిపారు. అధిక దిగుబడి సాధనకు అవసరమైన సాగు మెలకువలను రైతులకు అందించాలని తెలిపారు.

రవాణా శాఖలో నిలిచిన సేవలు

మంచిర్యాలరూరల్(హాజీపూర్): హాజీపూర్ మండలం వేంపల్లి గ్రామ శివారులోని జిల్లా రవాణా శాఖ కార్యాలయంలో తలెత్తిన సాంకేతిక సమస్య కారణంగా వాహనదారులకు సేవలు నిలిచిపోయాయి. సోమ, మంగళవారాల్లో వాహన రిజిస్ట్రేషన్లు, డ్రైవింగ్ లైసెన్స్ తదితర సేవలకు అంతరాయం ఏర్పడింది. రవాణా శాఖలో ప్రతీ రోజు వివిధ కార్యకలాపాల కోసం 300 వరకు స్లాట్‌లు బుకింగ్ అవుతుంటాయి. సోమవారం కార్యాలయంలోని ప్రధాన ఇంటర్‌నెట్ రూటర్‌లో సమస్య తలెత్తింది. ఈ రూటర్ నేరుగా రవాణా శాఖ కమిషనరేట్‌లోని సర్వర్‌కు అనుసంధానంగా ఉంటుంది. రూటర్ సమస్యతో స్లాట్ బుక్ చేసుకున్న వారికి సేవలు అందకపోవడంతో మరో రోజుకు అవకాశం కల్పిస్తూ స్లాట్‌లను అప్‌డేట్ చేశారు. ఇప్పటికే సమస్యను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లగా మరో రెండ్రోజుల్లో సంబంధిత సామగ్రి కార్యాలయానికి చేరుకుంది. కమిషనరేట్ నుంచి రూటర్, తదితర సామగ్రి వచ్చిన తర్వాతనే సేవలు అందుతాయని ఇంచార్జి డీటీఓ సంతోష్ తెలిపారు.

ఆర్టీఏలో ఏసీబీ అలర్ట్!

- అక్కడ దాడులు.. ఇక్కడ అప్రమత్తం
- జిల్లాలోనూ నిఘా పెంచాలంటున్న వాహనదారులు

సాక్షి ప్రతినిధి, మంచిర్యాల: రోడ్డు రవాణా శాఖ కార్యాలయాలు, చెక్‌పోస్టులపై అవినీతి నిరోధక శాఖ(ఏసీబీ) దాడులతో జిల్లా రవాణా శాఖ(ఆర్టీఏ) అప్రమత్తమైంది. మంగళవారం ఉమ్మడి జిల్లా పరిధిలో ఆదిలాబాద్ జిల్లా భోరజ్ చెక్‌పోస్టులోనూ తనిఖీలు జరిగాయి. జిల్లాలోనూ అధికారులు తనిఖీ చేస్తారనే ప్రచారం జరిగింది. మొదట ఉమ్మడి జిల్లాలో తనిఖీల్లో భాగంగా ఇక్కడ సైతం దాడులు నిర్వహిస్తారని భావించారు. ఏసీబీ అధికారులు జిల్లా వైపు రాకపోవడంతో అధికారులు ఊపిరి పీల్చుకున్నారు. కార్యాలయ సిబ్బందితోపాటు అధికారులు సైతం అప్రమత్తం అయ్యారు. ఏజెంట్లు, మధ్యవర్తులతో జరిపే రోజువారీ లావాదేవీలపై జాగ్రత్త వహించారు. ఏసీబీ దాడుల నేపథ్యంలో ప్రైవేటు సిబ్బంది, డ్రైవర్లు, కింది స్థాయి నుంచి ఉన్నత స్థాయి వరకు అధికారులు అలర్ట్‌గా ఉన్నారు.

వ్యవస్థీకృతంగా వసూళ్లు

రవాణా శాఖ కార్యాలయంలో ఏళ్లుగా వ్యవస్థీకృతంగా అక్రమ వసూళ్లకు పాల్పడుతున్నా బయటకు రాకుండా వ్యవహారం నడిపిస్తున్నారు. అప్పట్లో ఒకరిద్దరు అధికారులు చిక్కినా ఎక్కువ మంది తప్పించుకుంటున్నారు. రవాణా శాఖలో 17రకాల సేవలను వాహనదారులు నేరుగా పొందవచ్చు. కానీ మధ్యవర్తుల ప్రమేయంతో సర్కారుకు చెల్లించాల్సిన ఫీజుల కంటే అదనంగా వసూలు చేస్తున్నారు. ప్రభుత్వం ఏజెంట్ల వ్యవస్థను అరికట్టాలని ఆన్‌లైన్‌లోనే సేవలు అందుబాటులోకి తెచ్చింది. నేరుగా వెళ్లిన వాహనదారులను అక్కడి సిబ్బంది పలు రకాలుగా ఇబ్బంది పెట్టి చివరకు ఏజెంట్లతోనే వచ్చేలా చేస్తున్నారు. దీంతో జిల్లా రవాణా శాఖలో అవినీతి వ్యవస్థీకృతంగా మారింది. ఇక జిల్లా పరిధిలో లారీ, గూడ్స్ వాహనాల అసోసియేషన్లు, సింగరేణి, వాహన కాంట్రాక్టర్ల నుంచి అనధికారికంగా వసూళ్లకు పాల్పడుతున్నట్లు ఆరోపణలు ఉన్నాయి. ఇసుక, బొగ్గు, మట్టి, సిమెంట్, కర్ర, ప్యాసింజర్ ట్రావెల్స్, రవాణా చేసే తదితర భారీ వాహనాల ఫిట్‌నెస్‌ల కోసం ఏటా రూ.లక్షలు వసూలు చేస్తున్నా ఎక్కడా బయటకు రావడం లేదు. చాలామంది అనధికార వసూళ్లపై చూసీ చూడనట్లు ఉంటూ ఫిర్యాదులు ఇవ్వకపోవడం లేదు. ఈ వసూళ్లపై ఏసీబీని ఆశ్రయించకపోవడంతో కింది స్థాయి సిబ్బంది నుంచి పై స్థాయి వరకు అంతా సజావుగా వ్యవహారం నడుస్తోంది. రాష్ట్రంలో ఆర్టీఏ ఆఫీసుల్లో దాడులు చేస్తున్న క్రమంలో జిల్లా రవాణా శాఖ కార్యాలయంపైనా నిఘా ఉంచాలని వాహనదారులు కోరుతున్నారు.

ఓట్ల లెక్కింపునకు ఏర్పాట్లు

- రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి వికాస్‌రాజ్



పాల్గొన్న కలెక్టర్ బి.సంతోష్, అధికారులు

మంచిర్యాలఅగ్రికల్చర్: జూన్ 4న ఓట్ల లెక్కింపు ప్రక్రియ సజావుగా సాగేలా పకడ్బందీగా ఏర్పాట్లు చేయాలని రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి వికాస్‌రాజ్ అన్నారు. మంగళవారం హైదరాబాద్ నుంచి అదనపు ఎన్నికల అధికారులతో కలిసి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా జిల్లాల ఎన్నికల అధికారులు, కలెక్టర్లు, సహాయ ఎన్నికల అధికారులు, పోలీసు శాఖ అధికారులతో కౌంటింగ్ ప్రక్రియ నిర్వహణపై సమీక్ష సమావేశం నిర్వహించారు. రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి వికాస్‌రాజ్ మాట్లాడుతూ కౌంటింగ్ కేంద్రాల్లో ఓట్ల లెక్కింపునకు హాజరయ్యే ఎన్నికల అధికారులు, సిబ్బందికి ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా తాగునీరు, విద్యుత్ సరఫరా, ఇంటర్నెట్ ఇతరత్రా అన్ని ఏర్పాట్లు చేయాలని, కేంద్రంలోకి సరైన అనుమతి లేని వారిని, మొబైల్ ఫోన్లను అనుమతించరాదని సూచించారు. ట్రాఫిక్ నియంత్రణ, వాహనాల పార్కింగ్, కంట్రోల్ రూమ్, మీడియా సెంటర్ ఇతరత్రా ప్రతీ అంశంపై శ్రద్ధ తీసుకోవాలని, రౌండ్ల వారీగా ఫలితాలు వెలువరించే సమయంలో కౌంటింగ్ కేంద్రం వద్ద ఎలాంటి ఘటనలు జరుగకుండా బందోబస్తు చర్యలు చేపట్టాలని తెలిపారు. ఎన్నికల అధికారి, కలెక్టర్ సంతోష్ మాట్లాడుతూ హాజీపూర్ మండలం ముల్కల్లలోని ఐజా ఇంజినీరింగ్ కళాశాలలో ఓట్ల లెక్కింపునకు ఏర్పాట్లు చేసినట్లు తెలిపారు. కంట్రోల్ రూమ్, మీడియా సెంటర్లు ఏర్పాటు చేస్తామని తెలిపారు. సీసీ కెమెరాలు ఏర్పాటు చేసి అవాంఛనీయ ఘటనలు చోటు చేసుకోకుండా ప్రతీ అంశాన్ని పర్యవేక్షిస్తామని పేర్కొన్నారు. ఈ సమావేశంలో డీసీపీ అశోక్‌కుమార్, జిల్లా అదనపు కలెక్టర్లు రాహుల్, మోతీలాల్, మంచిర్యాల ఆర్డీవో రాములు, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ చంద్రకళ, ఎన్నికల తహసీల్దార్ శ్రీనివాస్ పాల్గొన్నారు.

లోక్ అదాలత్‌లో కేసుల పరిష్కారానికి కృషి చేయాలి



సమావేశంలో మాట్లాడుతున్న జడ్జి రవి, పాల్గొన్న పోలీసు అధికారులు, న్యాయవాదులు

చెన్నూర్: లోక్ అదాలత్‌లో ఎక్కువ సంఖ్యలో కేసుల పరిష్కారానికి పోలీసు అధికారులు, కోర్టు పోలీసులు కృషి చేయాలని జడ్జి రవి అన్నారు. వచ్చే నెల 8న లోక్ అదాలత్ నేపథ్యంలో మంగళవారం స్థానిక కోర్టులో చెన్నూర్ కోర్టు పరిధిలోని పోలీసు అధికారులతో సమన్వయ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జడ్జి రవి మాట్లాడుతూ డ్రంక్ అండ్ డ్రైవ్, చెక్‌బౌన్స్ కేసులు, సివిల్ కేసులతోపాటు ఇతర కేసుల్లో ఇరుపక్షాలు రాజీపడే విధంగా కక్షిదారులకు అవగాహన కల్పించాలని అన్నారు. లోక్ అదాలత్‌కు మరో పది రోజుల గడువు ఉండడంతో ఎక్కువ సంఖ్యలో కక్షిదారులతో మాట్లాడే అవకాశం ఉందని తెలిపారు. చెన్నూర్, కోటపల్లి సీఐలు రవీందర్, సుధాకర్, శ్వేత, బార్ అసోసియేషన్ అధ్యక్షుడు రమేశ్‌చందర్‌గిల్డా, ఏజీపీ రాంభావు, ఎక్సైజ్, బ్యాంక్ మేనేజర్లు, న్యాయవాదులు పాల్గొన్నారు.

పౌష్టికాహారం అందించాలి



సిబ్బందితో మాట్లాడుతున్న సంక్షేమాధికారి

రామకృష్ణాపూర్: అర్హులైనవారందరికీ అంగన్‌వాడీ కేంద్రాల్లో పౌష్టికాహారం అందించాలని జిల్లా సంక్షేమాధికారి చిన్నయ్య అన్నారు. పట్టణంలోని సుభాష్‌నగర్ ఏరియాలో అంగన్‌వాడీ–2 కేంద్రాన్ని మంగళవారం ఆయన తనిఖీ చేశారు. పలువురు అర్హులకు రేషన్, పౌష్టికాహారం అందడం లేదన్న ఫిర్యాదు మేరకు కేంద్రాన్ని పరిశీలించినట్లు తెలిపారు. కాగా జ్యోతినగర్ నుంచి సుభాష్‌నగర్‌కు దూరం ఉన్నందున పౌష్టికాహారం తీసుకోవడం ఇబ్బందిగా మారిందని స్థానికులు, వార్డు కౌన్సిలర్ సుధాకర్ సంక్షేమాధికారి దృష్టికి తీసుకెళ్లారు. కలెక్టర్ దృష్టికి సమస్య తీసుకెళ్తామని ఆయన హామీ ఇచ్చారు.

నిలిచిన భూ సర్వే



సర్వేయర్లకు అభ్యంతరం చెబుతున్న దేవాదాయ శాఖ అధికారులు

బెల్లంపల్లి: బెల్లంపల్లి మున్సిపాల్టీ పరిధి రైల్వేస్టేషన్ ఎదురుగా ఉన్న భూమిలో జాయింట్ సర్వేకు సిద్ధపడగా దేవాదాయ శాఖ అధికారులు అభ్యంతరం చెప్పడంతో నిలిచిపోయింది. పాత హద్దుల ప్రకారం కాకుండా రెవెన్యూ శాఖ సర్వేయర్లు కొత్త హద్దులను ప్రతిపాదించడంతో నిరాకరించారు. రైల్వేస్టేషన్ ముందున్న విలువైన భూమిపై కొంతకాలంగా వివాదం జరుగుతోంది. ఆకెనపల్లి శివారు సర్వే నంబరు 12/6లో 3.02 ఎకరాల భూమి రెవెన్యూ రికార్డుల్లో దేవాదాయ శాఖకు చెందినదిగా నమోదై ఉంది. ఆ పక్కన ఉన్న సర్వేనెంబర్ 12/4లో భూమి కలిగి ఉన్న కొందరు దేవాదాయ శాఖ భూమి పరిధిలో తమ భూమి కొంతమొత్తం ఉందని చెబుతున్నారు. దీంతో ఇరువురి మధ్య భూ వివాదం ఏర్పడింది. జాయింట్ సర్వే చేయాలని నిర్ణయించుకుని ఇరు శాఖల అధికారులు మొఖా వద్దకు వచ్చారు. రెవెన్యూ శాఖ సర్వేయర్లు భూ కొలతలు చేయడానికి సిద్ధపడగా హద్దుల వద్ద తేడా రావడంతో దేవాదాయ శాఖ అధికారులు అడ్డుపడ్డారు. సర్వే సరిగా జరగడం లేదని గ్రహించి ఆపేశారు. శాఖ అధికారుల దృష్టికి తీసుకెళ్లి నిర్ణయం తీసుకుంటామని చెప్పి అక్కడి నుంచి వెళ్లిపోయారు. దేవాదాయ శాఖ ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా అసిస్టెంట్ కమిషనర్ నవీన్‌కుమార్, దేవాదాయ శాఖ సర్వేయర్ అనిల్ కుమార్, రెవెన్యూ డివిజనల్ సర్వేయర్ నసీరొద్దీన్, దేవాదాయ ఈఓలు, సర్వేయర్ పాల్గొన్నారు.

క్లుప్తంగా

ఉరేసుకుని యువకుడు ఆత్మహత్య

లక్సెట్టిపేట: ఉరేసుకుని యువకుడు ఆత్మహత్య చేసుకున్న సంఘటన మండలంలో చోటు చేసుకుంది. ఎస్సై చంద్రకుమార్ తెలిపిన వివరాల మేరకు మండలంలోని దౌడపల్లి గ్రామానికి చెందిన పొన్నం అంజన్న(29) కొంతకాలంగా కడుపునొప్పి, సైనస్‌తో బాధపడుతున్నాడు. పలు ఆస్పత్రుల్లో చికిత్స చేయించినప్పటికీ నయం కాకపోవడంతో మనస్తాపానికి గురయ్యాడు. మంగళవారం ఇంటి ఆవరణలోని దూలానికి ఉరేసుకున్నాడు. ఉపాధి హామీ పనులకు వెళ్లిన తల్లిదండ్రులు వచ్చేసరికి మృతి చెంది ఉన్నాడు. మృతుని తండ్రి చిన్నయ్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్సై తెలిపారు.

శతాధిక వృద్ధుడు మృతి


రాజం (ఫైల్)

బెల్లంపల్లి: బెల్లంపల్లి మున్సిపాలిటీలోని గాంధీనగర్‌కు చెందిన శతాధిక వృద్ధుడు గుండా రాజం (107) మంగళవారం తెల్లవారు జామున మృతి చెందాడు. వయోభారం పడినప్పటికీ దైనందిన కార్యక్రమాలను ఇన్నాళ్లూ చురుగ్గా నిర్వహించాడు. మూడు రోజులుగా విరేచనాలతో బాధపడుతుండగా ఇంటివద్దనే తుదిశ్వాస విడిచినట్లు మృతుని కుమారుడు సీపీఐ జిల్లా సమితి సభ్యుడు గుండా చంద్రమాణిక్యం తెలిపారు.

వంకులంలో చోరీ

రెబ్బెన: మండలంలోని వంకులం గ్రామానికి చెందిన బోర్కుటే తిరుపతి ఇంట్లో గుర్తు తెలియని వ్యక్తులు చొరబడి నగదుతో పాటు బంగారం అపహరించుకుని వెళ్లినట్లు ఎస్సై డి.చంద్రశేఖర్ తెలిపారు. బాధిత కుటుంబ సభ్యులంతా వారం రోజుల క్రితం తిరుపతికి వెళ్లి మంగళవారం మధ్యాహ్నం ఇంటికి వచ్చే సరికి ఇంటి ముందు తలుపులు తెరిచి ఉన్నాయి. అనుమానం వచ్చి ఇంట్లోకి వెళ్లి పరిశీలించగా బీరువా తాళం పగలగొట్టి ఉంది. అందులో భద్రపర్చిన రెండు తులాల బంగారంతో పాటు, రూ. 20 వేల నగదు కనిపించకపోవటంతో పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఈ మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

దాడికి పాల్పడిన భర్తపై కేసు నమోదు

ఆదిలాబాద్‌టౌన్: ఆదిలాబాద్ పట్టణంలోని మహాలక్ష్మివాడకు చెందిన మహెమూద్–అఫ్సాన దంపతుల మధ్య గతేడాది నుంచి గొడవలు జరుగుతున్నాయి. దీంతో గతేడాది మహిళా పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేసి పుట్టింట్లోనే ఉంటోంది. సోమవారం మహెమూద్ అత్తారింటికి వెళ్లి కాపురానికి రావాలని భార్యను కోరాడు. ఆమె నిరాకరించడంతో కోపోద్రిక్తుడై బండరాయితో కడుపులో కొట్టాడు. అడ్డు వచ్చిన అఫ్సాన తల్లి హుస్నూర్‌తో పాటు మరో మహిళపై సైతం దాడి చేశాడు. బాధితులు మంగళవారం టూటౌన్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు.



ఇంటర్మీడియెట్ చదువులు మిథ్య

ఇంటర్ విద్యను అభ్యసించడానికి గ్రామీణ ప్రాంత విద్యార్థులకు అవకాశాలు కానరావడం లేదు. దశాబ్దాల నుంచి ఎన్నో వ్యయప్రయాసాల కోర్చి ఇతర ప్రాంతాలకు వెళ్లి చదువుకోవడమో.. పరిస్థితి అనుకూలించక 'పది'తోనే ఆపేయాల్సి వస్తోంది. దీంతో వారికి ఇంటర్ విద్య మిథ్యగా మారుతోంది.

- మండలానికో ప్రభుత్వ జూనియర్ కళాశాల మంజూరు ఉత్తమాటే
- ఎన్నికల హామీని నిలబెట్టుకోని ప్రజాప్రతినిధులు
- ఇబ్బంది పడుతున్న విద్యార్థులు

బెల్లంపల్లి: ఇంటర్ ఫస్టియర్‌లో ప్రవేశానికి అడ్మిషన్లు జరుగుతున్నాయి. టెన్త్ ఫలితాలు వెలువడటంతోనే ప్రైవేట్, కార్పొరేట్ కళాశాలల్లో చేరికల ప్రక్రియ ప్రారంభం కాగా ప్రస్తుతం ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో అడ్మిషన్లకు తెరలేచింది. జూన్ 1 నుంచి ఇంటర్ తరగతులు ప్రారంభం కానున్నాయి. టెన్త్ ఉత్తీర్ణులైన విద్యార్థులు కళాశాలల్లో చేరికకు సన్నద్ధమవుతుండగా గ్రామీణప్రాంత విద్యార్థులు దిక్కుతోచని పరిస్థితులను చవిచూస్తున్నారు. బెల్లంపల్లిలో రెండు, కాసిపేట మండలంలో ఒకటి చొప్పున ప్రభుత్వ జూనియర్ కళాశాలలు ఉండగా భీమిని, కన్నెపల్లి, వేమనపల్లి, నెన్నెల, తాండూర్ మండలాల్లో కళాశాలలు లేకుండా ఉన్నాయి. ఇంటర్ కళాశాల లేక ఎక్కడి వెళ్లి చదువుకోవాలో, ఆర్థిక వనరులు ఎంతగా అవసరమవుతాయో తేల్చుకోలేక సతమతమవుతున్నారు.

ఏటా ఉత్తీర్ణత

టెన్త్ ఫలితాల్లో విద్యార్థులు ముందంజలో ఉంటున్నారు. అసెంబ్లీ నియోజకవర్గం నుంచి ఏటా సగటున వెయ్యిమంది వరకు టెన్త్ పరీక్షలకు హాజరవుతుండగా వీరిలో గరిష్ఠంగా 80 నుంచి 90 శాతం మంది పాసవుతున్నారు. వీరిలో బెల్లంపల్లి, కాసిపేట మండలాల విద్యార్థులను మినహా ఇస్తే మిగతా ఐదు మండలాల విద్యార్థులు ఇంటర్ చదువుల కోసం యాతనకు గురికావల్సి వస్తోంది.

హామీలు నీటి మూటలేనా?

ప్రతీ మండలానికో ప్రభుత్వ జూనియర్ కళాశాల మంజూరు ఎన్నికల హామీగానే మిగులుతోంది. మాజీ ఎమ్మెల్యే దుర్గం చిన్నయ్య దశాబ్దకాలం పాటు ఎమ్మెల్యేగా కొనసాగారు. గ్రామీణ ప్రాంత విద్యార్థుల సౌలభ్యం కోసం జూనియర్ కళాశాల మంజూరు చేయిస్తానని హామీ గుప్పించి ఎమ్మెల్యేగా గెలిచి పదేళ్లు కొనసాగిన ఆ వాగ్దానాన్ని నెరవేర్చలేకపోయారు. ప్రస్తుత ఎమ్మెల్యే గడ్డం వినోద్ కూడా హామీ ఇచ్చి ఇంతవరకు ఆ ఊసెత్తడం లేదు.

ఇంటర్ చదువుకోవడానికి..

గ్రామీణ ప్రాంత విద్యార్థులు ఇంటర్ చదువుకోవడానికి బెల్లంపల్లి, మంచిర్యాల, చెన్నూర్ ప్రాంతాలకు ప్రైవేట్ వాహనాలు, ఆర్టీసీ బస్సుల్లో వెళ్లి వస్తుంటారు. ఆర్థికంగా ఉన్న కొద్దిమంది తల్లిదండ్రులు తమ పిల్లలను ప్రైవేట్‌లో చేర్పిస్తున్నారు. మరికొందరు తల్లిదండ్రులు అప్పు చేసి కరీంనగర్, వరంగల్, హైదరాబాద్ తదితర ప్రాంతాలకు పంపిస్తున్నారు. ఆర్థికలేమి కారణంగా పలువురు విద్యార్థులు ప్రభుత్వ జూనియర్ కళాశాల లేక దిక్కుతోచని పరిస్థితులను చవిచూస్తున్నారు.

ఆర్థిక స్తోమత లేదు



మాది నిరుపేద కుటుంబం. గతేడాది పదో తరగతి పాసైన. దూర ప్రాంతాలకు వెళ్లి చదువుకోవడానికి ఆర్థిక స్తోమత లేక ఏకంగా పదోతరగతితోనే చదువు ఆపేసిన. చదవాలనే కోరిక ఉన్నా స్థానికంగా ప్రభుత్వ జూనియర్ కళాశాల లేదు.

– తెల్ల వెంకటేశ్, వేమనపల్లి

అనువైన పరిస్థితులు లేవు



నాది నెన్నెల. పదో తరగతి ఈఏడాదే పాసైన. ఇలాంటి పరిస్థితుల్లో మా మండలంలో ప్రభుత్వ జూనియర్ కళాశాల ఉంటే ఇంటర్ విద్య పూర్తి చేసే అవకాశాలు స్థానికంగానే ఉండేటివి. దూర ప్రాంతాలకు వెళ్లి చదువుకోవడానికి పల్లె ప్రాంతాల ఆడపిల్లలకు అనువైన పరిస్థితులు ఉండటం లేదు.

– చెన్నోజు విష్ణుప్రియ, నెన్నెల

ఇతర ప్రాంతానికి వెళ్లి చదువుకుంటా



కన్నెపల్లి మండలంలో జూనియర్ కళాశాల లేక ఇతర ప్రాంతానికి వెళ్లి చదువు కోవాల్సి వస్తోంది. కరీంనగర్ లేదా హైదరాబాద్ కు పంపించాలనే ఉద్దేశంతో మా తల్లిదండ్రులు ఉన్నారు. మండలంలో జూనియర్ కళాశాల ఉంటే బహుషా దూరం పంపించే వారు కాదేమో. అందుబాటులో ప్రభుత్వ జూనియర్ కళాశాల ఏర్పాటు చేయాలి.

– పూదరి అక్షిత్, రెబ్బెన

ఆవిర్భావ వేడుకలు ఘనంగా నిర్వహించాలి


ప్రగతి మైదానాన్ని పరిశీలిస్తున్న జీఎం

శ్రీరాంపూర్: జూన్ 2న తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావ వేడుకలను ఘనంగా నిర్వహించాలని శ్రీరాంపూర్ జీఎం బీ.సంజీవరెడ్డి అధికారులను ఆదేశించారు. మంగళవారం జీఎం కార్యాలయంలోని తన చాంబర్‌లో పలు డిపార్టుమెంట్ల ముఖ్య అధికారులతో వేడుకలపై సమీక్ష సమావేశం నిర్వహించారు. అనంతరం వేడుకలు నిర్వహించే ప్రగతి మైదానాన్ని సందర్శించి ఏర్పాట్లపై పలు సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో శ్రీరాంపూర్ ఎస్‌వోటూ జీఎం పురుషోత్తంరెడ్డి, ఏజీఎం ఫైనాన్స్ మురళీధర్, ఓపెన్‌కాస్ట్ అధికారి శ్రీనివాస్, ఏరియా ఇంజనీర్ చంద్రశేఖర్‌రెడ్డి, ఏజెంట్ గోపాల్‌సింగ్, డీజీఎంలు అరవిందరావు, చిరంజీవులు, ఆనంద్‌కుమార్, అధికారుల సంఘం ఏరియా అధ్యక్షుడు వెంకటేశ్వర రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

మందమర్రిలో...


మాట్లాడుతున్న జీఎం మనోహర్

మందమర్రిరూరల్: జూన్ 2న ఆవిర్భావ వేడుకలను ఘనంగా నిర్వహించాలని ఏరియా జీఎం మనోహర్ అన్నారు. మంగళవారం ఏరియా జీఎం కార్యాలయంలో అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. కార్యక్రమాలకు సంబంధించి ఏర్పాట్ల కోసం అధికారులకు పలు సూచనలు చేశారు. సమావేశంలో అధికారులు, యూనియన్ల ప్రతినిధులు పాల్గొన్నారు.

సామాజిక సేవలో కూడా ముందుండాలి

- జీఎం సంజీవరెడ్డి

శ్రీరాంపూర్: సింగరేణి ఉద్యోగులు బొగ్గు ఉత్పత్తిలోనే కాకుండా సామాజిక సేవలో కూడా ముందుండాలని శ్రీరాంపూర్ జీఎం సంజీవరెడ్డి అన్నారు. మంగళవారం ఆర్కే 8 డిస్పెన్సరీలో ఎస్సార్పీ 1, ఎస్సార్పీ 3, 3ఏ గనులకు చెందిన పలువురు ఉద్యోగులు రక్తదానం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అన్ని దానాల్లో కెల్లా రక్తదానం గొప్పదన్నారు. ఎంతోమంది సమయానికి రక్తం అందక అర్ధాంతరంగా ప్రాణాలు కోల్పోతున్నారన్నారు. ఆపద సమయంలో రక్తదానం చేయడం వలన అలాంటి వారి ప్రాణాలను నిలబెట్టే అవకాశం దక్కుతుందన్నారు. ఈ కార్యక్రమంలో గుర్తింపు సంఘం ఏఐటీయూసీ బ్రాంచ్ సహాయ కార్యదర్శి ఎం.కొమురయ్య, డిప్యూటీ చీఫ్ మెడికల్ ఆఫీసర్ రమేశ్‌బాబు, పిట్ సెక్రెటరీ విజయ, సిబ్బంది కామర వేణు, తోట మల్లేశ్, తదితరులు పాల్గొన్నారు.


రక్తదాతలకు సర్టిఫికెట్లు ఇస్తున్న జీఎం

ప్రహరీ నిర్మించాలని వినతి

మంచిర్యాలటౌన్: మంచిర్యాల మున్సిపాలిటీ పరిధిలోని ఉమర్‌మియా సొసైటీ లేఔట్‌లో పార్కు కోసం మున్సిపల్‌కు ఇచ్చిన స్థలం చుట్టూ ప్రహరీ నిర్మించాలని కోరుతూ మున్సిపల్ ఫ్లోర్ లీడర్ అంకం నరేశ్ మంగళవారం మున్సిపల్ చైర్మన్ రావుల ఉప్పలయ్య, కమిషనర్ మారుతి ప్రసాద్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కొంతమంది అక్రమార్కులు పార్కు స్థలాన్ని కబ్జా చేసే ప్రమాదం ఉందని, ఇందుకోసం కౌన్సిల్‌లో నిధులు వెచ్చించి ప్రహరీ నిర్మించాలని కోరారు. ఈ కార్యక్రమంలో బీఆర్‌ఎస్ నాయకులు సుంకరి రమేశ్, తాజుద్దీన్, కిరణ్, తదితరులు పాల్గొన్నారు.


వినతిపత్రం ఇస్తున్న అంకం నరేశ్

డ్రైవింగ్ స్కూళ్లలోనూ లైసెన్స్

- జూన్ ఒకటి నుంచి కొత్త చట్టం అమలు
- కనీసం మూడెకరాల స్థలం అవసరం

మంచిర్యాలరూరల్(హాజీపూర్): రహదారి భద్రత చట్టం అమలులో భాగంగా కేంద్ర ప్రభుత్వం మరో నూతన సంస్కరణకు శ్రీకారం చుడుతోంది. ఇందులో భాగంగా అక్రిడేటెడ్ డ్రైవింగ్ స్కూళ్లను అందుబాటులోకి తీసుకు రానుంది. ఇకపై రవాణా శాఖ కార్యాలయానికి వెళ్లనవసరం లేకుండా ఈ స్కూళ్లలో డ్రైవింగ్ శిక్షణ పొందిన వారికి నేరుగా డ్రైవింగ్ లైసెన్స్ జారీ చేస్తారు. మోటారు వాహన చట్టం మార్పులో భాగంగా ఇకపై డ్రైవింగ్ లైసెన్స్ ప్రక్రియ అంతా కూడా ప్రైవేటు భాగస్వామ్యంలో సాగనుంది. ఈ చట్టం జూన్ ఒకటి నుంచి అమలులోకి రానుంది. కాగా, జిల్లాలో ఇప్పటివరకు అక్రిడేటెడ్ డ్రైవింగ్ స్కూల్ లేదు సరికదా ఇప్పటికిప్పుడు డ్రైవింగ్ స్కూల్ ఏర్పాటు కూడా కష్టమే. రవాణా శాఖ చట్టం నిబంధన మేరకు అక్రిడేటెడ్ డ్రైవింగ్ స్కూల్ ఏర్పాటు చేయాలంటే పలు నిబంధనలు కఠినంగా ఉన్నాయి. ఇప్పుడున్న వారు ఏర్పాటుకు సముఖంగా లేరు. డ్రైవింగ్ స్కూల్ ఏర్పాటుకు సంస్థలు, వ్యక్తులు ముందుకు వస్తే అనుమతి ఇస్తామని రవాణా శాఖ అధికారులు పేర్కొంటున్నారు.

పారదర్శకతతో డ్రైవింగ్ ఉంటేనే..

అక్రిడేటెడ్ డ్రైవింగ్ స్కూళ్లు ఇచ్చే డ్రైవింగ్ శిక్షణ నాణ్యమైనదిగా, సమర్థవంతమైనదిగా, పారదర్శకతతో ఉంటే లైసెన్స్‌లు ఇవ్వాలనేది రవాణా శాఖ ముఖ్యోద్దేశం. డ్రైవింగ్ స్కూళ్లు ఇచ్చే 5–ఏ సర్టిఫికెట్ల ఆధారంగా నేరుగా లైసెన్స్ జారీ చేస్తారు. డ్రైవింగ్ లైసెన్స్‌ల జారీలో రవాణాశాఖ అధికారులను పరిమితం చేస్తూ తీసుకొస్తున్న అక్రిడేటెడ్ స్కూళ్ల ఏర్పాటు ప్రస్తుతం కష్టతరంగానే ఉండనుంది. ప్రస్తుతం ఉన్న సాధారణ డ్రైవింగ్ స్కూళ్లు కూడా కఠిన నిబంధనలతో స్కూళ్ల ఏర్పాటు కష్టమే అంటున్నారు.

మూడెకరాలు కావాల్సిందే..

డ్రైవింగ్ స్కూల్ ఏర్పాటుకు కనీసం మూడెకరాల స్థలం కావాలి. రెండెకరాల్లో డ్రైవింగ్ టెస్ట్ ట్రాక్, ప్రాథమిక శిక్షణ కోసం సిమ్యులేటర్లు ఏర్పాటు చేయాలి. మరో ఎకరంలో శిక్షణ తరగతుల కోసం భవనం, తరగతి గదులు, ఇంటర్‌నెట్ సదుపాయం, ఆటోమేటిక్ సిగ్నల్ వ్యవస్థ, టీచింగ్ పరికరాలు మౌలిక సదుపాయాలు కల్పించాలి. భూముల విలువ రూ.కోట్లలో ఉండగా మూడెకరాల్లో డ్రైవింగ్ స్కూల్ ఏర్పాటు కష్టమే అంటున్నారు. అయినా ముందుకు వచ్చి ఏర్పాటు చేస్తే ఆదాయం ఆ స్థాయిలో ఉంటుందా అనేది అనుమానమే.

నకిలీ విత్తనాలు స్వాధీనం

చింతలమానెపల్లి: మండలంలోని దిందా గ్రామంలో మంగళవారం 10 కిలోల నకిలీ విత్తనాలు పట్టుకున్నట్లు ఎస్సై నరేశ్ తెలిపారు. తమకు అందిన సమాచారం మేరకు వ్యవసాయ, పోలీసు శాఖల ఆధ్వర్యంలో తనిఖీలు నిర్వహించగా డగే తిరుపతి ఇంటి ముందు పత్తి విత్తనాలు దొరికాయి. విచారణలో ఈవిత్తనాలు కుంటల మానెపల్లి గ్రామానికి చెందిన శివుడు సరఫరా చేసినట్లు తేలింది. వ్యవసాయ అధికారి రామకృష్ణ ఫిర్యాదు మేరకు డగె తిరుపతి, శివుడుపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.


విత్తనాలు స్వాధీనం చేసుకుంటున్న పోలీసులు

అరచేతిలో వాతావరణం



- ప్రత్యేక యాప్‌లు రూపొందించిన కేంద్ర ప్రభుత్వం
- వాతావరణ పరిస్థితులను ఎప్పటికప్పుడు తెలుసుకునే సౌలభ్యం
- అన్నదాతలకు ప్రయోజనకరమంటున్న అధికారులు

ఈ మధ్యకాలంలో ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలో విభిన్న వాతావరణ పరిస్థితులు కనిపిస్తున్నాయి. ఒకరోజు అత్యధిక ఉష్ణోగ్రతలు నమోదవుతుండగా మరొక రోజు ఈదురు గాలులతో కూడిన అకాలవర్షాలు కురుస్తున్నాయి. దీంతో అన్నదాతలు అయోమయానికి గురయ్యే పరిస్థితులు నెలకొంటున్నాయి. ఈ నేపథ్యంలో వాతావరణంలోని మార్పులను ఎప్పటికప్పుడు ప్రజలకు చేరవేసేందుకు కేంద్ర ప్రభుత్వం ప్రత్యేక యాప్‌లు రూపొందించింది. వీటి ద్వారా వాతావరణ పరిస్థితులను అంచనా వేయొచ్చని వాతావరణశాఖ అధికారులు పేర్కొంటున్నారు. ప్రధానంగా వర్షాకాలం మొదలుకానున్న నేపథ్యంలో ఉష్ణోగ్రతల వివరాలు, వర్షాల రాక సమాచారాన్ని కూడా వీటి ద్వారా తెలుసుకోవచ్చు. ఉరుములు, మెరుపుల నుంచి రక్షించుకోవడం, వర్షం పరిస్థితులను అంచనా వేయడం కూడా చేయవచ్చు. ఇందుకోసం కేంద్ర ప్రభుత్వ ఎర్త్ సైన్సెస్ మంత్రిత్వ శాఖ రూపొందించిన ఈ యాప్ లు రైతులకు తోడ్పడనున్నాయి. ఆండ్రాయిడ్ మొబైల్ ఫోన్లో ప్లే స్టోర్ ద్వారా వీటిని డౌన్‌లోడ్ చేసుకుంటే చాలు. వాతావరణ సమాచారం మొత్తం మన అరచేతిలో ఉన్నట్లే..ఆ యాప్‌లు ఏమిటో తెలుసుకుందాం..


– నిర్మల్‌ఖిల్లా

వాతావరణ సమగ్ర వివరాలతో 'మేఘదూత్'



మేఘదూత్ యాప్‌లో వాతావరణానికి సంబంధించిన సమగ్ర సమాచారం అందుబాటులో ఉంటుంది. వర్షపాతం వివరాలు, గాలిలో తేమ, గాలి యొక్క వేగం, గాలి వీచే దిశ, నమోదైన ఉష్ణోగ్రతలు రానున్న 24 గంటల్లో వాతావరణ సమాచారం ఎప్పటికప్పుడు అప్‌డేట్ చేస్తుంది. గడిచిన వారం రోజులు, రానున్న మరో నాలుగు రోజుల వాతావరణ విశేషాలు సైతం ఈ యాప్ ద్వారా తెలుసుకోవచ్చు.


'డామిని'లో ఉరుములు, మెరుపుల హెచ్చరికల సమాచారం



ఒక్కోసారి వాతావరణంలో అప్పటికప్పుడు మార్పులు సంభవించి ఉరుములు మెరుపులు వస్తాయి. పిడుగుపాటు కూడా సంభవించే అవకాశం ఉంటుంది.

ఇలాంటి హెచ్చరికలను తెలిపేందుకు డామిని యాప్ ప్రయోజనకరంగా ఉంటుంది. మెరుపు ఎప్పుడు వస్తుంది? మెరిసినప్పుడు తీసుకోవాల్సిన జాగ్రత్తలు, అప్రమత్తంగా ఉండాల్సిన తీరును ఈ యాప్ ద్వారా తెలుసుకోవచ్చు. లొకేషన్ ఆధారంగా మెరుపులు వచ్చే అవకాశం ఉందో? లేదో? కూడా తెలుస్తుంది. పిడుగు పడినప్పుడు తోటి వారికి అందించాల్సిన వైద్య సహాయం వంటి ప్రాథమిక సమాచారాన్ని తెలియజేస్తుంది. రైతులకు, రైతు కూలీలకు బయటి ప్రాంతాల్లో పనిచేసే వారికి ఈ యాప్ ఎంతగానో తోడ్పడుతుంది.

వర్ష సూచనకు 'రెయిన్ అలారం'



వర్షం ఎప్పుడు పడుతుంది.. గడిచిన రోజుల వర్షపాతం వివరాలు, రానున్న కాలంలో వర్ష సూచనలను రెయిన్ అలారం యాప్ తెలియజేస్తుంది. మనం నివసిస్తున్న ప్రాంతంలో వాతావరణ, వర్ష సూచనలతో పాటు ఇతర ప్రాంతాల్లో ఎక్కడెక్కడ ఏ స్థాయిలో వర్షాలు కురుస్తున్నాయో, తదితర వివరాలు కూడా తెలియజేస్తుంది. వాతావరణంలోని ఉష్ణోగ్రత, గాలిలోని తేమ, మేఘావృతమైన ప్రాంతాల వివరాలను తగిన డేటాతో వివరిస్తుంది.

కరెంట్ ఇయ్యం...దిక్కున్న చోట చెప్పుకోండి..

- గ్రామస్తులకు విద్యుత్ సిబ్బంది బెదిరింపులు

వేమనపల్లి: 'ఎక్కువ మాట్లాడితే మీకు కరెంట్ ఇయ్య...దిక్కున్న చోట చెప్పుకోండి' అంటూ జేఎల్ఎం బెదిరిస్తున్నాడని జాజులపేట గ్రామస్తులు ఆరోపిస్తున్నారు. గ్రామంలో 120 విద్యుత్ కనెక్షన్‌ను ఉండగా 15 రోజుల క్రితం గ్రామానికి ఆధారమైన ట్రాన్స్‌ఫార్మర్ చెడిపోయింది. దీంతో ట్రాన్స్‌కో సిబ్బంది గ్రామంలో ఉన్న ఆర్‌డబ్ల్యూఎస్ తాగునీటి అవసరాల కోసం అమర్చిన మినీ ట్రాన్స్‌ఫార్మర్‌కు తాత్కాలిక కనెక్షన్ ఇచ్చారు. కెపాసిటీ సరిపోక ఓవర్‌లోడ్‌తో ఫీజులు కొట్టివేయడంతో సరఫరాలో నిత్యం అంతరాయం కలుగుతోంది. గ్రామస్తులే ఫీజులు వేసుకోవడం చేస్తున్నారు. ట్రాన్స్‌ఫార్మర్‌కు మరమ్మతు చేసేందుకు మంగళవారం సాయంత్రం జేఎల్ఎం ఉదయ్‌కుమార్ గ్రామానికి వెళ్లగా 15 రోజుల నుంచి కరెంట్ కష్టాలతో ఇబ్బంది పడుతున్నామని, ఎవరూ పట్టించుకోవడంలేదని అనడంతో మాటా మాట పెరిగి విద్యుత్ సిబ్బంది అక్కడి నుంచి వెళ్లి పోయారు. గ్రామస్తులు ఎస్ఈ శేషారావుకు సమాచారం ఇవ్వగా ఆయన బెల్లంపల్లి డీఈ రాజన్నకు సమాచారం ఇచ్చి రెండు రోజుల్లో సమస్య పరిష్కరించాలని ఆదేశించారు.


చెడిపోయిన ట్రాన్స్‌ఫార్మర్ వద్ద గ్రామస్తులు

దాడిలో ఒకరు మృతి

ఖలీల్‌వాడి: నిజామాబాద్ నగరంలోని త్రీటౌన్ పోలీస్ స్టేషన్ పరిధిలో ఆసిఫాబాద్‌కు చెందిన వ్యక్తిపై పలువురు దాడి చేయడంతో మృతి చెందినట్లు ఎస్సై ప్రవీణ్‌కుమార్ మంగళవారం తెలిపారు. వివరాలు ఇలా ఉన్నాయి.. కుమురంభీం ఆసిఫాబాద్ జిల్లాకు చెందిన అలీ హుస్సేన్ (40) అదే జిల్లాకు చెందిన చంద్రి నిర్మలను పదిహేనేళ్ల క్రితం ప్రేమ వివాహం చేసుకున్నాడు. వీరికి ఇద్దరు కుమారులు ఉన్నారు. మద్యానికి బానిసైన అలీ హుస్సేన్ తరచూ కొడుతుండడంతో నిర్మల పుట్టింటికి వెళ్లిపోయింది. బతుకుదెరువు కోసం నిజామాబాద్‌కు వచ్చిన హుస్సేన్ స్థానిక మహిళతో సహజీవనం చేస్తూ ఇక్కడే ఉంటున్నాడు. అలీ హుస్సేన్ ఆదివారం తను సహజీవనం చేస్తున్న మహిళ బంధువైన మరో మహిళతో అసభ్యకరంగా ప్రవర్తించాడు. దీంతో సదరు మహిళతో పాటు ఆమె భర్త, బంధువులు హుస్సేన్‌పై దాడి చేశారు. తీవ్రగాయాలపాలైన హుస్సేన్‌ను ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ సోమవారం మృతి చెందాడు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

గుర్తుతెలియని మృతదేహం లభ్యం

భైంసాటౌన్: పట్టణంలోని రాహుల్‌నగర్ స్మశాన వాటిక సమీపంలో సుద్దవాగులో మంగళవారం గుర్తుతెలియని వ్యక్తి మృతదేహం లభ్యమైంది. కుళ్లిన స్థితిలో ఉన్న మృతదేహం గుర్తించిన పశువుల కాపర్లు పోలీసులకు సమాచారమివ్వగా మృతదేహాన్ని వెలికితీయించి స్థానిక ఏరియా ఆస్పత్రికి తరలించారు. మృతుని వయస్సు సుమారు 25 నుంచి 35 ఏళ్లలోపు ఉంటుందని సీఐ రాజారెడ్డి తెలిపారు. రెండు రోజుల క్రితం మృతి చెంది ఉండవచ్చని ఆయన పేర్కొన్నారు.